క్లుప్తంగా

వాహన సేవలో భక్తుల ఇక్కట్లు



తిరుమలలో గ్యాలరీ గేట్లకు తాళాలు వేసిన దృశ్యం

సాక్షి ప్రతినిధి, తిరుపతి : తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి నిర్వహించిన పెద్ద శేషవాహన సేవలో భక్తులు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. సేవలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొనడంతో అధికారులు నానా హంగామా చేశారు. గ్యాలరీల్లోకి వెళ్లేందుకు వీలు లేకుండా ఎక్కడికక్కడ గేట్లకు తాళాలు వేసేశారు. దీంతో సామాన్య భక్తులకు శ్రీవారి దర్శన భాగ్యం కూడా దక్కలేదు. అలాగే చంద్రబాబు భద్రతా సిబ్బంది ఎస్ఎస్‌జీ గార్డులను సైతం స్థానిక పోలీసులు అడ్డుకోవడం పలువురిని ఆశ్చర్యపరిచింది.



ఎస్ఎస్‌జీ కమాండోలను అడ్డుకుంటున్న పోలీసులు

తిరుపతి వాసులకు తిప్పలు

సీఎం చంద్రబాబు రోడ్డు మార్గంలో తిరుమలకు ప్రయాణిస్తుండడంతో కార్పొరేషన్ అధికారులు నగరంలో భారీ ఏర్పాట్లు చేశారు. దారిపొడవునా బారికేడ్లు పెట్టడంతో నగరవాసులు రాకపోకలకు తిప్పలు పడ్డారు. వ్యాపారులు కనీసం దుకాణాలు కూడా తెరుచుకునే పరిస్థితి లేకుండా పోయింది. ఈ సందర్భంగా తమది బారికేడ్ల ప్రభుత్వం కాదని మంత్రి లోకేష్ చేసిన వ్యాఖ్యలను పలువురు ప్రస్తావించడం గమనార్హం.

గంగమ్మ ఆలయ ఈఓగా జయకుమార్

తిరుపతి కల్చరల్ : శ్రీ తాతయ్యగుంట గంగమ్మ ఆలయ ఈఓగా ఎ.జయకుమార్ నియమితులయ్యారు. ఆయన తలకోన సిద్ధేశ్వర స్వామివారి ఆలయం నుంచి బదిలీపై వచ్చారు. శుక్రవారం ఈ మేరకు గంగమ్మను దర్శించుకుని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఈఓగా విధులు నిర్వర్తించిన కె.మమత చంద్రగిరి మూలస్థాన ఎల్లమ్మ ఆలయానికి ఈఓగా బదిలీ అయ్యారు. అలాగే తలకోన ఆలయ ఈఓగా అదనపు బాధ్యతలు చేపట్టనున్నారు.

అర్హులందరికీ సంక్షేమం

తిరుపతి రూరల్ : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామని ఎంపీడీఓ కొడగంటి రామచంద్ర తెలిపారు. శుక్రవారం తిరుపతి రూరల్ ఎంపీడీఓఆయన బాధ్యతలు స్వీకరించారు. కేవీబీపురం నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఎంపీడీఓ మాట్లాడుతూ రూరల్ మండలానికి రూ.2 కోట్ల ఉపాధి మెటీరియల్ కాంపొండ్ నిధులు మంజూరైనట్లు వెల్లడించారు. ఎంపీడీఓ రామచంద్రతో పాటు పరిపాలనాధికారిగా రంగనాథం, సీనియర్ అసిస్టెంట్ పవనమూర్తి బాధ్యతలు స్వీకరించారు. వీరికి సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఎంపీడీఓగా గిడ్డయ్య

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు ఎంపీడీఓగా గిడ్డయ్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అందించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు.

ఏపీఎంగా స్వర్ణలత

చిన్నగొట్టిగల్లు ఏపీఎంగా స్వర్ణలత శుక్రవారం బాధ్యతలు చేపట్టా రు. ఆమె మాట్లాడుతూ సంఘాలను బలోపేతం చేసి, ఆర్థికాభివృద్ధి చెందేందుకు సహకరిస్తామని తెలిపారు.

డ్రైనేజీ నిర్మాణానికి ప్రణాళిక

తిరుపతి రూరల్: మండలంలోని వెంకటపతినగర్‌లో మురుగునీటి సమస్య పరిష్కారం కోసం పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నారు. సర్పంచ్ చిన్నియాదవ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హేమాద్రి పంచాయతీలోని రాములవారి గుడి వెనుక వీధి నుంచి డ్రైనేజీ నిర్మించేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. ఈ మేరకు రూ.20 లక్షల నిర్మాణ వ్యయంతో అంచనాలు రూపొందించారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని సర్పంచ్ తెలిపారు.

ఆంధ్రా స్పైస్ ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభం



రెస్టారెంట్ ప్రారంభిస్తున్న వైష్ణవ్, చరణ్

తిరుపతి కల్చరల్ : ఎయిర్ బైపాస్ రోడ్డులోని ఎస్‌బీఐ బ్యాంక్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ది రాయల్ ఆంధ్రా స్పైస్ ఫ్యామిలీ రెస్టారెంట్‌ను శుక్రవారం రెస్టారెంట్ అధినేతలు తిరునగరి వైష్ణవ్, తిరునగరి చరణ్ కుటుంబ సభ్యులు ఘనంగా ప్రారంభించారు. వారు మాట్లాడుతూ నాణ్యత, శుచి, రుచికరమైన నోరూరించే ఆహార పదార్థాలను అందించడమే లక్ష్యంగా ప్యూర్ వెజ్ ఆంధ్రా టిఫిన్‌లను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. అలాగే రెండో ఫ్లోర్‌లో అన్ని రకాల నాన్‌వెజ్ వంటకాలు లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో సునీల్ పాల్గొన్నారు.

● నేత్రపర్వం

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుమల శోభాయమానంగా ముస్తాబైంది. విశేషాలంకరణలతో కనువిందు చేస్తోంది. అశేష భక్తజనుల గోవింద నామస్మరణలతో పులకిస్తోంది. భువి వైకుంఠ వైభవాన్ని ఇనుమడింపజేస్తూ ఆధ్యాత్మిక సౌరభాలను వెదజల్లుతోంది. ఈ క్రమంలోనే పెద్దశేష వాహనంపై విహరిస్తున్న మలయప్పస్వామి దివ్యతేజస్సుతో జగజ్జేయమానంగా వెలుగొందుతోంది. విశిష్ట కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలతో తన్మయత్వం చెందుతోంది. ఈ మేరకు సమస్త దేవగణాలకు సాదర స్వాగతం పలుకుతోంది. - తిరుమల



పెద్దశేష వాహన సేవలో గోపికా మానసచోరుని ప్రత్యేకతను వివరిస్తూ కళాబృందం ప్రదర్శన



విశేష పుష్పాలతో తీర్చిదిద్దిన కళారూపం



పుష్పశోభితం



రామాయణ గాథను వివరించేలా అద్భుత రూపకల్పన

సేంద్రియం.. సాగు సంబరం

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడి సాధించవచ్చని అధికారులు వెల్లడిస్తున్నారు. సాగును సంబరంగా మార్చుకునేందుకు తమ సలహాలు పాటించాలని కోరుతున్నారు. ప్రకృతి సేద్యానికి పెట్టుబడి సైతం తక్కువగా ఉంటుందని తెలియజేస్తున్నారు.ఈ క్రమంలో ×పొలం పిలుస్తోంది₹ కింద క్షేత్రస్థాయిలో పంటల సాగుపై అన్నదాతలకు అవగాహన కల్పిస్తున్నారు. అలాగే ఉత్పత్తుల మార్కెటింగ్ అవకాశాలను వివరిస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపడుతున్నారు.

- ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి
- అన్నదాతలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు
- క్షేత్రస్థాయిలో ముమ్మరంగా 'పొలం పిలుస్తోంది'



పంటలను పరిశీలిస్తున్న డీఏఓ ప్రసాదరావు (ఫైల్)

పాకాల : ప్రభుత్వం నిర్వహిస్తోన్న పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా అధికారులు ప్రత్యేకంగా రైతులకు పంటల సాగుపై శిక్షణ ఇస్తున్నారు.



పొలం పిలుస్తోందిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడిని సాధించే ప్రకృతి సేద్యంపై దృష్టి సారించాలని సూచిస్తున్నారు. ప్రతి మంగళవారం, బుధవారాల్లో పొలం పిలుస్తోంది కింద గ్రామాల్లో పర్యటిస్తూ అన్నదాతలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖతోపాటు ఉద్యాన శాఖ, పశుసంవర్ధక శాఖ, మార్కెటింగ్ శాఖ (ఏఎంసీ), అటవీ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొంటున్నారు. స్థానికంగా సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు, రైతులు ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారు.

తెగుళ్ల నివారణపై అవగాహన

ప్రకృతి సాగులో రసాయన ఎరువులకు బదులుగా జీవామృతం, బీజామృతం వినియోగించడం పురుగుల మందులకు బదులుగా కషాయాలు వాడడం వల్ల భూసారం పెరిగి నాణ్యమైన దిగుబడులు వస్తాయని అధికారులు వెల్లడిస్తున్నారు. వరిని ఆశించే తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నారు. ఆధునిక వ్యవసాయ విధానంపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలని సూచిస్తున్నారు. దోమ, కాండం కుళ్లు, తెల్లచీడ, ఆకుముడత తదితర తెగుళ్ల బారిన పంటలు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు. అలాగే తెగుళ్ల నుంచి పంటలను కాపాడుకునేందుకు కషాయాలు ఏవిధంగా తయారు చేసుకోవాలి, వాటిని ఏవిధంగా వాడాలనే విషయాలపై అవగాహన కల్పిస్తున్నారు. అంతర పంటలు సాగు చేసి అధిక లాభాలను పొందేందుకు అవసరమైన సలహాలు అందిస్తున్నారు. ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న వ్యవసాయ పనిముట్లు పొందే విధానాలను వివరిస్తున్నారు. నీటి యాజమాన్య పద్ధతుల్లో రాయితీ ధరలకు డ్రిప్‌లు, స్ప్రింక్లర్ల వాడకంపై శిక్షణ ఇస్తున్నారు. భూసార పరీక్షల లాభాలను వివరిస్తున్నారు. పంట సాగులో మిత్ర పురుగులు, శత్రు పురుగులతో లాభనష్టాలను తెలియజేస్తున్నారు.



పంటలను పరిశీలిస్తున్న జిల్లా మైక్రో ఇరిగేషన్ ఆఫీసర్ జి.సతీష్ (ఫైల్)

ఉద్యాన పంటలపై సైతం..

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఉద్యాన పంటపై కూడా అవగాహన కల్పిస్తున్నారు. కూరగాయలు, పండ్లు, పూల తోటలు సాగు, పంటలకు వచ్చే చీడ పీడలు, వాటి నివారణ మార్గాలను వివరిస్తున్నారు. ఉద్యాన పంటల్లో ప్రభుత్వం నుంచి రాయితీలు ఏవిధంగా అందుతాయి, రైతులు ఎలా పొందాలి అనే విషయాలను తెలియజేస్తున్నారు. సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చేసి అధిక దిగుబడులు సాధించేందుకు మెలకువలు వెల్లడిస్తున్నారు. అలాగే పశుసంవర్ధ శాఖ అధికారులు పాడి రైతులకు సూచనలు, సలహాలు అందిస్తున్నారు. పాల ఉత్పత్తిని ఏవిధంగా వృద్ధి చేసుకోవాలి, పశువులకు ఎలాంటి దాణా వేయాలి అనే విషయాలతో పాటు పశువులకు సంక్రమించే నట్టల వ్యాధికి నివారణ మార్గాలపై అవగాహన కల్పిస్తున్నారు.

మంచి కార్యక్రమం



ప్రతీ మంగళ, బుధవారాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రైతులకు ఉన్న సందేహాలను నివృత్తి చేస్తున్నారు. పంటలకు ఎలాంటి రోగాలు వచ్చాయనే విషయాలను క్షేత్ర స్థాయిలో పొలాలను పరిశీలించి వాటికి నివారణ మార్గాలను తెలుపుతున్నారు. రైతులకు ఈ కార్యక్రమం బాగా ఉపయోగపడుతుంది.

– శ్రీహరినాయుడు, అడుసుపల్లి, పాకాల మండలం.

రైతులు తప్పని సరిగా హాజరవ్వాలి



ప్రభుత్వం చేపట్టిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి రైతులు తప్పనిసరిగా హాజరవ్వాలి. ఈ కార్యక్రమంలో రైతులకు ఉపయోగపడే అనేక అంశాలను వివరించి శిక్షణ అందిస్తాం. పంటల్లో అధిక దిగుబడులు సాధించేందుకు సూచనలు, సలహాలు ఇస్తాం. అధికారులు తమ గ్రామాల్లోకి వచ్చి ఇచ్చే శిక్షణను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– రమేష్‌నాయక్, ఏఈఓ, పాకాల

ఎంతో ఉపయోగకరం



పొలం పిలుస్తోంది కార్యక్రమం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. స్థానికంగా ఉండే అధికారులతో పాటు జిల్లా స్థాయి అధికారులు, శాస్త్రవేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రభుత్వం ఎలాంటి పథకాలు అమలు చేస్తోంది, వాటిని రైతులు ఏ విధంగా పొందవచ్చు అనే విషయాలను కూడా వివరిస్తాం.

– పుష్పావతి, ఏఓ, పాకాల మండలం

రాధాకృష్ణుల సేవలో చెవిరెడ్డి



పూజలు నిర్వహిస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తిరుపతి రూరల్ : ఇస్కాన్‌లోని రాధాకృష్ణులను శుక్రవారం తుమ్మలగుంటలోని శ్రీకల్యాణ వెంకన్న ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దర్శించుకున్నారు. కల్యాణ వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా చెవిరెడ్డి గోవిందమాల ధరించారు. అనంతరం ఇస్కాన్ జాతీయ అధ్యక్షుడు రేవతి రమణదాస్ ప్రభును బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడసేవ రోజు కల్యాణ వెంకన్నకు ఇస్కాన్ నిర్వాహకులు పట్టువస్త్రాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది.

ఎన్ఎస్‌యూలో సరస్వతీ పూజ



పూజలు నిర్వహిస్తున్న వీసీ, అధ్యాపకులు

తిరుపతి సిటీ : జాతీయ సంస్కృత వర్సిటీ సెంట్రల్ లైబ్రరీలో శుక్రవారం సరస్వతీ పూజను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ సరస్వతీ దేవీ ఆశీర్వాదంతో విద్యార్థులు మంచి జ్ఞానం సంపాదించాలని ప్రార్థించామన్నారు. చదువుల తల్లి అనుగ్రహం అందరి పైనా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వర్సిటీ డీన్ ప్రొఫెసర్ ఎస్.లత, అధ్యాపకుడు సంపత్ కుమార్, డిప్యూటీ లైబ్రేరియన్ వసంత్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



పారిశుద్ధ్య పనులు తనిఖీ చేస్తున్న కమిషనర్

తిరుపతి తుడా : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో శుక్రవారం తనపల్లె క్రాస్ నుంచి శ్రీనివాససేతు ఫ్లైఓవర్ మీదుగా అలిపిరి వరకు పారిశుద్ధ్య పనులను కమిషనర్ మౌర్య పరిశీలించారు. పారిశుద్ధ్య పనులు మెరుగ్గా ఉండాలని, బారికేడ్లు పటిష్టంగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రోడ్లపైన ఎక్కడా గుంతలు లేకుండా చూడాలని, ముఖ్యమంత్రి పర్యటన మార్గంలో ఫ్లెక్సీలు ఉండకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్లు తులసీ కుమార్, గోమతి, డీఈ మహేష్, రాజు, ఏసీపీ బాలాజీ, రమణ, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య పాల్గొన్నారు.

సమానం వేతనంతోనే న్యాయం

తిరుపతి సిటీ : సమాన పనికి సమాన వేతనం అందిస్తేనే కాంట్రాక్ట్ వర్కర్లకు న్యాయం జరుగుతుందని సీఐటీయూ నేతలు స్పష్టం చేశారు. సోమవారం వెటర్నరీ వర్సిటీ డీటీ హాస్టల్‌లో కాంట్రాక్ట్ వర్కర్ల సమావేశం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర, ఆప్కాస్ రాష్ట్ర అధ్యక్షుడు జి.చిన్నబాబు మాట్లాడుతూ వర్సిటీలో కాంట్రాక్ట్ ప్రాతిపదిన పనిచేస్తున్న 500 మందిని శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. యూనివర్సిటీ యాజమాన్యం జోక్యం చేసుకుని వేతనాలు పెంచి, సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా ఎస్ అలీభాయ్ ప్రధాన కార్యదర్శిగా రాజేష్, కోశాధికారిగా కిరణ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా తులసీరామ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కనకరాజు, ఉపాధ్యక్షులుగా మంజుల, సహాయ కార్యదర్శిగా మల్లికార్జునతో పాటు 22 మందితో కమిటీని ఏర్పాటు చేశారు. సమావేశంలో ఆప్కాస్ రాష్ట్ర నాయకులు బి.మునిరాజా, జైగంగయ్య, వై.ధనంజయులు సుభహాన్, మురళీనాయుడు పాల్గొన్నారు.

కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్‌గా దినకర్

తిరుపతి లీగల్ : తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్‌గా (న్యాయ సలహాదారు) టి.దినకర్‌ను నియమిస్తూ కమిషనర్ మౌర్య శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. దినకర్ సుమారు 25ఏళ్ల నుంచి న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. తిరుపతి న్యాయవాదుల అసోసియేషన్ అధ్యక్షుడిగా రెండుసార్లు, ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శిగా సేవలు అందించారు. దినకర్ నియామకంపై పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

మండల అభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి

రామచంద్రాపురం : మండల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు వారి శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. జెడ్పీటీసీ సభ్యులు ఢిల్లీరాణి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మంజూరైన భవనాల నిర్మాణాలను డిసెంబర్‌లోపు పూర్తి చేయాలన్నారు. ఎంపీడీఓ ఇందిరమ్మ, ఎంఈఓ జయవేలు, వైద్యాధికారి తేజస్విని, ఏపీఎం గురుమూర్తి, డీటీ అన్వర్‌బాషా, ఏఓ గిరి, ఏపీఓ హంసవేణి పాల్గొన్నారు.

ఆర్‌ఓ-2గా రవి నియామకం

తిరుపతి తుడా : తిరుపతి నగర పాలక సంస్థ రెవెన్యూ అధికారి-2గా సచివాలయ విభాగం సూపరింటెండెంట్ రవిని నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా తోటి ఉద్యోగులు ఆయనకు అభినందనలు తెలిపారు. రవి మాట్లాడుతూ నగర పాలక సంస్థ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు.

శోభాయమానం.. నవరాత్రి వైభవం

- అమ్మవారికి విశేష అలంకరణలు
- పెద్దశేషవాహనంపై ఊరేగిన మూలస్థాన ఎల్లమ్మ

చంద్రగిరి : గ్రామ దేవత మూస్థాన ఎల్లమ్మతల్లి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మొదటి రోజు శుక్రవారం అమ్మవారు శ్రీలక్ష్మీదేవి అలంకరణలో పెద్ద శేషవాహనంపై కొలుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం మూలవిరాట్‌తో పాటు, అష్టలక్ష్మీదేవతలు, నాగదేవత, నవగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మూలమూర్తికి అభిషేక సేవ జరిపించారు. రాత్రి శ్రీలక్ష్మీ అలంకరణలో పెద్దశేషవాహనంపై అమ్మవారిని ఊరేగించారు. తిరుపతికి చెందిన విజయ్ కుమార్, చంద్రగిరికి చెందిన లావణ్య, సత్యనారాయణ, దేవరాజుల రెడ్డి, పుత్తూరుకు చెందిన జయకృష్ణ ఉభయకర్తలుగావ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి , ఈఓ మమత పాల్గొన్నారు.

విశేష పూజలు

దేవి నవరాత్రుల్లో భాగంగా మండలంలోని అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. పుట్టాలమ్మ ఆలయంలోని సంతోషి మాత పార్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తొండవాడలోని ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారు బాలత్రిపురా సుందరిగా భక్తులను అనుగ్రహించారు. తిరుచానూరు గ్రామ దేవత పొక్కాలమ్మ గాయత్రి అలంకరణలో దర్శనమిచ్చారు. దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త శ్రీధర్ రెడ్డి తెలిపారు.



పెద్ద శేషవాహనంపై ఊరేగుతున్న ఎల్లమ్మతల్లి

రామచంద్రాపురం: మండలంలోని సూరావారిపల్లి సమీపంలో ఉన్న సురభి గోసంరక్షణ శాలలో దుర్గాదేవి అమ్మవారు శుక్రవారం బాల త్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్ స్వామిజీ చేతులమీదుగా భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

భక్తులకు అన్నదానం

తిరుపతి రూరల్ : తుమ్మలగుంటలోని శ్రీశక్తి చాముండేశ్వరీదేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు లక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త బిరుదాల భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

తిరుపతి రూరల్ : తిరుపతి ఆపరేషన్ విద్యుత్ సబ్‌డివిజన్-1 పరిధిలో నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యమని డీఈ జయప్రకాష్ తెలిపారు. తిరుపతి సబ్ డివిజన్-1 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు(డీఈ)గా శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. నూతన డీఈను ఏఈలు గంగాధర్‌రెడ్డి, బాలాజీ, డీఈలు మునిప్రసాద్, మాధవరావు, రమేష్, ఏఈలు మునిరామ్, ఉమాపతి, నాగేంద్ర, రామాంజనేయులు, సిబ్బంది అభినందించారు.

క్రిమినల్ చట్టాలపై అవగాహన

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ న్యాయ విభాగం ఆధ్వర్యంలో తిరుపతి పోలీస్ ట్రైనింగ్ కాలేజ్ అధికారులు క్రిమినల్ కొత్తచట్టాలపై న్యాయశాస్త్ర విభాగం విద్యార్థినులకు అవగాహన కల్పించారు. శుక్రవారం నిర్వహించిన ఈ సదస్సులో సీఐ టి. మధుసూదన్‌రెడ్డి, ఎస్ఐలు సురేష్, అశ్విని, దివ్య మాట్లాడుతూ చట్టాలను వివరించారు. ప్రొఫెసర్ టి.సీతా కుమారి, జి.ఇందిర పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ఐదుగురికి జైలు

తిరుపతి లీగల్ అధిక మోతాదులో మద్యం తాగి వాహనాలు నడిపిన ఐదుగురికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. మరో పదిమందికి రూ. 10వేల చొప్పున జరిమానా విధించారు.

ప్రజలకు 'వారాహి' వేదన

తిరుపతి కల్చరల్ : ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గురువారం నిర్వహించిన వారాహి సభతో ప్రజలను తీవ్రంగా ఇబ్బందిపెట్టారని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్.హరికృష్ణ మండిపడ్డారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నగర నడిబొడ్డున మీటింగ్ పెట్టుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. దీంతో చంద్రగిరి వైపు నుంచి వచ్చే వాహనాలను నిలిపివేశారని, దీంతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందిపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇక్కట్లు తలెత్తాయని వెల్లడించారు.